సాక్షి మెదక్

మంగళవారం । 10 । డిసెంబర్ । 2024



యంత్రం.. రైతులకు దూరం

రైతులకు తక్కువ ధరకే యంత్రాలను అద్దెకు అందించాల్సిన కస్టమ్ హైరింగ్ కేంద్రం అలంకారప్రాయంగా మారింది.

వివరాలు 8లో ▸



సర్వే నుంచి మినహాయించాలి

ఇందిరమ్మ ఇళ్ల సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలని జిల్లావ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులు నిరసన తెలిపారు.

వివరాలు 9లో ▸

నేడు జాబ్ మేళా

మెదక్ కలెక్టరేట్: మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన, శిక్షణ అధికారి రామరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు.

న్యూస్‌రీల్

నేడు దివ్యాంగులకు ప్రత్యేక ప్రజావాణి

కలెక్టర్ రాహుల్‌రాజ్



మెదక్ కలెక్టరేట్: కలెక్టరేట్‌లో మంగళవారం దివ్యాంగుల కోసం ప్రత్యేక ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం రోజు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నామని, అందుకనుగుణంగా ప్రత్యేక ప్రజావాణి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెల రెండవ మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు దివ్యాంగుల సమస్యలపై వినతులు స్వీకరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి, ఎల్‌డీఎం, ఆర్టీసీ డీఎం, మెప్మా పీడీ సంబంధిత శాఖల అధికారులు హాజరుకావాలని ఆదేశించారు.

పారదర్శకంగా ఎంపిక



ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హులైన లబ్ధిదారులనే ఎంపిక చేయాలని, పారదర్శకంగా ఉండాలని తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మండలంలోని జీడిపల్లిలో సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ లక్ష్మీనర్సయ్య, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఆశాలపై దౌర్జన్యం తగదు

ఎమ్మెల్యే సునీతారెడ్డి



నర్సాపూర్: ఆశావర్కర్లపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని ధర్నా చేస్తుంటే మహిళలని సైతం చూడకుండా పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించారని వాపోయారు. మహిళా ఉద్యోగులపై దాడి చేసి అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. మహిళలను కొట్టిన పోలీసులపై చర్యలు తీసుకొని, ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సిబ్బందితో మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి

నర్సాపూర్: నర్సాపూర్ గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. సోమవారం గ్రంథాలయాన్ని సందర్శించగా.. సిబ్బంది సమస్యలను ఆమెకు వివరించారు. ప్రధానంగా ఫర్నీచర్ కావాలని, టాయిలెట్స్ నిర్మించాలని, వృద్ధులకు గ్రౌండ్ ఫ్లోర్‌లో పుస్తక పఠనానికి వసతి కల్పించాలని చెప్పారు. వాటిని వంతుల వారీగా పరిష్కరిస్తానని, మొదటగా ఫర్నీచర్ సదుపాయం కల్పిస్తానని ఆమె హామీ ఇచ్చారు.

ఏడుపాయలకు రూ. 1.15 లక్షల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న సిబ్బంది

పాపన్నపేట(మెదక్): ఏడుపాయలలో సోమవారం నిర్వహించిన టెండర్ల ద్వారా రూ. 1.15 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ చంద్రశేఖర్ తెలిపారు. దేవస్థాన ప్రాంగణంలో చెప్పుల స్టాండ్‌కోసం వేలం పాట నిర్వహించగా.. రూ. 1.15 లక్షలకు మెదక్‌కు చెందిన అరవింద్ టెండర్ దక్కించుకున్నారు. కొబ్బరి కాయల అమ్మకం, ఒడి బియ్యం పోగు చేయడం, ఆలయం వద్ద పూజా సామగ్రి విక్రయించుకునేందుకు టెండర్లు నిర్వహించగా.. ఎవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేసినట్లు చెప్పారు. వాయిదా వేసిన టెండర్లకు త్వరలో వేలం పాట నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు నేరుగా సంప్రదించాలి

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న ఎస్పీ

మెదక్ మున్సిపాలిటీ: ప్రజలు పోలీస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించి మాట్లాడారు. ప్రజలు మధ్యవర్తులను ఆశ్రయించొద్దని, సమస్యలుంటే నేరుగా సంప్రదించాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలను స్వీకరించి తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులతో ఫోన్‌లో సమస్య స్థితిని వివరించారు. తక్షణ పరిష్కారం చూపాలని వారికి ఎస్పీ సూచించారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

నర్సాపూర్: కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను సోమవారం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ కేక్ కట్ చేసి నృత్యాలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, పార్టీ కో ఆర్డినేటర్ ఆంజనేయులు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్‌లో కాంగ్రెస్ నాయకుల ర్యాలీ

ఎదగని బాల్యం!

1,718 మంది చిన్నారులకు పోషకాహార లోపం

ఆరోగ్యంగా ఉండాలంటే.. పోషకాహారం ఎంతో అవసరం. ఎదిగే పిల్లలు అనారోగ్యం బారిన పడకుండా ఉండాలంటే.. సమతుల ఆహారం కీలకం. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పాలు, గుడ్లు, బాలామృతం, మధ్యాహ్న భోజనం తదితర వాటిని అందిస్తున్నా.. ఇంకా అనేక మంది బలహీనంగానే ఉన్నారు. జిల్లావ్యాప్తంగా 1,718 మంది చిన్నారులు పోషకాహారలోపంతో బాధపడుతున్నట్లు అధికారుల గణంకాలు చెబుతున్నాయి.



జిల్లాలోని ఓ అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారి బరువు చూస్తున్న సిబ్బంది

మెదక్‌జోన్: జిల్లావ్యాప్తంగా 1,076 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 0 నుంచి 3 సంవత్సరాల చిన్నారులు 31,286 మంది, 3 నుంచి 6 ఏళ్ల పిల్లలు 22,299 మంది చొప్పున మొత్తం 53,585 మంది ఉన్నారు. వీరిలో 1,718 మంది చిన్నారులు ఎత్తుకు తగిన బరువు లేకపోవడం, మరికొందరు వయసుకు తగిన ఎత్తు పెరగకపోవడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లావ్యాప్తంగా 5,293 మంది గర్భిణులు ఉండగా, బాలింతలు 4,651 మంది ఉన్నారు. వీరి ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకోవడంతో పాటు పుట్టిన శిశువు ఆరేళ్ల వయసు వచ్చే వరకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందుతూనే ఉంది. అలాంటిది వందలాది మంది చిన్నారులు పోషకాహారలోపంతో బాధపడుతుండటం ఆందోళన కలిగిస్తున్న అంశం.

వేధిస్తున్న సిబ్బంది కొరత

పేద, మధ్య తరగతి కుటుంబాల ఆరోగ్య కల్పతరువైన అంగన్‌వాడీ కేంద్రాల్లో అనేక సమస్యలు తిష్ట వేశాయి. ఒక్కో సెంటర్‌కు ఒక్కో టీచర్‌తో పాటు ఒక ఆయా తప్పనిసరిగా ఉండాలి. జిల్లావ్యాప్తంగా 1,076 కేంద్రాలకు గానూ 1,043 మంది టీచర్లు మాత్రమే ఉన్నారు. ఈలెక్కన ఇంకా 33 మంది కావాల్సి ఉంది. అలాగే ఆయాలు 793 మంది మాత్రమే ఉన్నారు. ఇంకా 283 ఖాళీలు ఉన్నాయి. చిన్నపిల్లలు కేంద్రాలకు రాకుంటే ఆయా ఇళ్లకు వెళ్లి చిన్నారులను కేంద్రానికి తీసుకురావాలి. అలాగే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెనూ ప్రకారం వంట చేసి పెట్టాలి. టీచర్ ఆట వస్తువులతో పిల్లలను ఆడిస్తూ పూర్వ ప్రాథమిక విద్యను బోధించాల్సి ఉంటుంది. కానీ సిబ్బంది కొరతతో లబ్ధిదారులకు సరైన పోషకాలతో కూడిన ఆహారం అందడం లేదనే వాదన వినిపిస్తోంది. అలాగే అక్షరాలకు శ్రీకారం చుట్టే అంగన్‌వాడీ కేంద్రాలకు అధిక శాతం అద్దె భవనాలే దిక్కయ్యాయి. ఇరుకు గదులు, గాలి, వెలుతురు సరిగా లేకుండా, రేకుల షెడ్లు, పూరి గుడిసెల్లో కొనసాగుతున్నాయి. జిల్లాలో 359 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉండగా.. 322 కేంద్రాలు కిరాయి (అద్దె) భవనాల్లో కొనసాగుతున్నాయి. మరో 395 అద్దె లేనివి.. అనగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు సొంత భవనాలను నిర్మించడంతో పాటు అనారోగ్యంతో సతమతమవుతున్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రత్యేక దృష్టి సారించాం

పోషకాహార లోపం, ఇతర సమస్యలతో ఎదగని చిన్నారుల కోసం ప్రత్యేక మెనూ కొనసాగిస్తున్నాం. నిబంధనల ప్రకారం 7 నెలల నుంచి 3 ఏళ్ల పిల్లలకు నెలకు 16 గుడ్లు మాత్రమే ఇస్తాం. కానీ ఎత్తుకు తగిన బరువు, వయసుకు తగిన ఎత్తు పెరగని చిన్నారుల కోసం ప్రతీ రోజు ఉడకబెట్టిన గుడ్డుతో పాటు భోజనం పెడుతున్నాం. అలాగే ప్రతి 15 రోజులకోసారి వైద్య సిబ్బందితో పరీక్షలు చేయిస్తున్నాం. ఆందోళనకరంగా ఉన్న పిల్లలను సంగారెడ్డి (ఎన్ఆర్‌సీ)కి పంపిస్తున్నాం. అక్కడ కొన్ని రోజులు వైద్యంతో పాటు పౌష్టికాహారం అందిస్తారు.

– హైమావతి, డీడబ్ల్యూఓ, మెదక్

ప్రజావాణికి ప్రాధాన్యం ఇవ్వాలి

- ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం చూపాలి
- అదనపు కలెక్టర్ నగేష్



ప్రజావాణిలో తమ గోడు వినిపిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మెదక్ కలెక్టరేట్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న జిల్లాస్థాయి ప్రజావాణికి అధికారులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణిలో పాల్గొనే జిల్లాస్థాయి అధికారులు సమయపాలన పాటించాలన్నారు. ఉదయం 10.15 గంటలకు హాజరై రిజిస్ట్రర్‌లో సంతకం చేయాలన్నారు. మనపై ఎంతో నమ్మకంతో జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చే ప్రజలకు సరైన న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజావాణికి 53 అర్జీలు రాగా.. అందులో ధరణి సమస్యలపై 23, డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం 6, పెన్షన్ల కోసం 2, ఇతర సమస్యలపై 22 వినతులు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ భుజంగరావు, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్డీఓ శ్రీనివాస్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సర్వే చేయలేం: పంచాయతీ కార్యదర్శులు

తాము విధులు నిర్వర్తించే గ్రామాల్లో సర్వే చేయలేమని, పక్క గ్రామాల్లో సర్వే చేసేలా అవకాశం కల్పించాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అలాగే అప్పులు చేసి పంచాయతీలను నడిపిస్తున్నామని, వెంటనే నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు సంతోష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రెండేళ్లుగా తిరుగుతున్నాం

మా అమ్మ పేరున గల భూమి సర్వే చేయాలని రెండేళ్లుగా తిరుగుతున్నా. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. గత నెల ప్రజావాణిలో సైతం వినతిపత్రం అందజేశాం. అయినప్పటికీ స్పందన కరువైంది. ఇప్పటికైనా మా భూమి సర్వే చేసి న్యాయం చేయాలని కొడిపల్లి మండలం ముత్రాజ్‌పల్లికి చెందిన ఆకుల భిక్షపతి ప్రజావాణిలో విజ్ఞప్తి చేశారు.

పకడ్బందీగా గ్రూప్– 2 పరీక్ష

మెదక్‌జోన్: ఈనెల 15, 16 తేదీల్లో నిర్వహించే గ్రూప్– 2 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ నగేష్ ఆదేశించారు. ఈమేరకు సోమవారం కలెక్టర్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షను ప్రశాంతంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. టీజీపీఎస్సీ నిబంధనల మేరకు ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా 16 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పరీక్షకు 5,855 మంది అభ్యర్థులు హాజరుకానునట్లు తెలిపారు. అభ్యర్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. 16 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 58 మంది పరిశీలకులు, 44 మంది బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, ఐదుగురు రూట్, 16 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఐదుగురు ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందిని నియమించామని తెలిపారు. సమావేశంలో కలెక్టరేట్ ఏఓ యూనస్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల డబ్బులు మాయం

- నందిగామలో మళ్లీ వెలుగు చూసిన మోసం
- సుమారు రూ. 60 లక్షలు కాజేసిన సీఏ



మాట్లాడుతున్న మహిళా సంఘాల సభ్యులు

నిజాంపేట(మెదక్): ప్రతి నెల మహిళా సంఘాలకు చెందిన డబ్బులను బ్యాంకులో చెల్లించకుండా సీఏ మోసం చేశారని మండలంలోని నందిగామకు చెందిన సభ్యులు సోమవారం పోలీసులను ఆశ్రయించారు. వారు తెలిపిన వివరాల మేరకు.. గతంలో సెంట్రల్ బ్యాంకు నుంచి మహిళలకు రుణాలు ఇచ్చేవారు. రెండేళ్లుగా జిల్లా సహకార బ్యాంకు నుంచి రుణాలు ఇస్తున్నారు. అయితే గతంలో ఇదే గ్రామంలో రూ. కోటికి పైగా మహిళా సంఘాల డబ్బులను చెల్లించకుండా సీఏ ప్రవీణ మోసం చేసింది. ఆ డబ్బులకు సంబంధించి కొంతమేర ఆమె నుంచి రికవరీ చేసినా.. కోర్టులో విచారణ జరుగుతోంది. అయితే సీఏను మార్చకుండా ఇప్పటికీ ఆమెనే కొనసాగిస్తున్నారు. ఈక్రమంలో గ్రామంలోని 8 సంఘాలకు చెందిన మహిళా సంఘాల డబ్బులను 2 సంవత్సరాలుగా బ్యాంకులో చెల్లిస్తున్నట్లు నమ్మబలికింది. ఇటీవల బ్యాంకు నుంచి 8 మహిళా సంఘాలకు చెందిన సభ్యులకు నోటీసులు రావడంతో మోసం వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై మహిళలు బ్యాంకును సంప్రందించగా రెండేళ్లుగా సీఏ డబ్బులను చెల్లించడం లేదని తెలిసింది. సుమారు రూ. 65 లక్షలు సొంతానికి వాడుకుందని.. అధికారులు వెంటనే స్పందించి మా డబ్బులను ఇప్పించాలని రామాయంపేట పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు.

'ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి'

మెదక్ కలెక్టరేట్: ఆశావర్కర్లకు పారితోషికాలు కాకుండా, ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించి అమలు చేయాలని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు నర్సమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఆన్‌లైన్ సర్వేలు చేయాలంటూ ఆశాలను అధికారులు ఒత్తిడికి గురి చేస్తున్నారని వాపోయారు. అలాగే పంచాయతీ కార్మికులకు నాలుగు నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదన్నారు.

సోనియా చొరవతోనే తెలంగాణ

పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సోనియాగాంధీ జన్మదిన వేడుకల్లో జగ్గారెడ్డి

సంగారెడ్డి: సోనియాగాంధీ చలవతోనే తెలంగాణ వచ్చిందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. సోమవారం సంగారెడ్డిలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పోతరాజులతో కలిసి నృత్యం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్నివర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు కట్టుబడి ఉన్నామన్నారు. సోనియా, రాహుల్‌గాంధీ మాటలు విశ్వసించి తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన రోజు నుంచే హామీల అమలుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. హామీల విషయంలో ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, ప్రజలు వారి మాటలు నమ్మవద్దని కోరారు. టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి తోపాజి అనంత కిషన్, నాయకులు కూన సంతోష్, కిరణ్‌గౌడ్, శ్రీశైలం కార్యకర్తలు పాల్గొన్నారు.

దుకాణాలకు రీ టెండర్ వేయించండి




బక్కి వెంకటయ్యకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ దుకాణాలకు రీ టెండర్ వేయించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి ఫిర్యాదు చేసినట్లు ఎమ్మార్పీఎస్ నాయకుడు బాల్‌రాజ్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో పలు సంఘాల ఆధ్వర్యంలో ఆయనను కలిశారు. మెదక్ మున్సిపాలిటీకి సంబంధించి పటేల్‌కుంటలో గల దుకాణాలను రీ టెండర్ వేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయనకు వివరించారు. దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో పలుమార్లు ఫిర్యాదు చేయగా రీ టెండర్లు వేస్తామని ప్రకటించిన మున్సిపల్ కమిషనర్ బదిలీ అయ్యారని తెలిపారు. అగ్రిమెంట్ ముగిసి ఏళ్లు గడుస్తున్నా.. ఇంకా దుకాణాలు వారి చేతుల్లో ఉన్నాయని చెప్పారు. ఫలితంగా ఎంతో మంది నిరుద్యోగులు స్వయం ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మొసలి కలకలం

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం పన్యాల గ్రామ శివారులోని మంజీరా నది ప్రాంతంలో మొసలి కలకలం సృష్టించింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పన్యాల నవాబుపేట గ్రామ శివారులో ప్రవహిస్తున్న మంజీరా నది ఒడ్డున రాళ్లపై ఒకసారిగా మొసలి ప్రత్యక్షం కావడంతో అటుగా వెళ్లిన ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మంజీరా నదిలో చేపల వేటకు వెళ్తున్న మత్స్యకారులు సైతం భయపడుతున్నారు.



'అంతారం' అటా.. ఇటా ?

- కౌడిపల్లి మండలంలోకి మారుస్తూ గతంలో గెజిట్
- రెండేళ్లు అయినా విలీనం కాని వైనం
- ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు



అంతారం గ్రామ పంచాయతీ

కౌడిపల్లి(నర్సాపూర్): అంతారం గ్రామం కౌడిపల్లి మండలంలో ఉందా.. చిలప్‌చెడ్‌లో ఉందా..? తెలియక గ్రామస్తులు అయోమయంలో ఉన్నారు. పంచాయతీని మార్చాలని గతంలో పలుమార్లు గ్రామస్తులు కోరగా 2022లో అప్పటి ప్రభుత్వం కౌడిపల్లి మండలంలోకి మారుస్తూ గెజిట్ విడుదల చేసింది. అయితే రెండేళ్లు గడిచినా నేటికీ మార్పు జరగలేదు. రెవెన్యూకు ఇక్కడ.. ఇతరశాఖల పనులకు అక్కడికి వెళ్లాల్సి వస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

2022లో గెజిట్ విడుదల

ఉమ్మడి కౌడిపల్లి మండలం సలాబత్‌పూర్ పంచాయతీలో అంతారం మధిర గ్రామంగా ఉండేది. 2016లో కొత్త మండలాలు ఏర్పడడంతో 11 పంచాయతీలతో పాటు అంతారం కొత్తగా ఏర్పడిన చిలప్‌చెడ్ మండలంలో చేరింది. అనంతరం కొత్త జీపీల ఏర్పాటుతో పంచాయతీగా మారింది. కాగా మండలాల ఏర్పాటు జరిగినప్పుడు అంతారం చిలప్‌చెడ్ పరిధిలోకి వెళ్లగా.. మండలంలోని పలు పంచాయతీ పరిధిలో ఉన్న రెవెన్యూ గ్రామాలు దాసుగూడ, లింగరావుగూడ, శేరిఫైజాబాద్, మంగళపల్లి కౌడిపల్లి మండలంలో ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రెండు మండలాలకు తిరుగుతూ అవస్థలు పడ్డారు. ఈసమస్యలను అప్పటి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా మార్పు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీంతో 2022లో అప్పటి ప్రభుత్వం అంతారం పంచాయతీని కౌడిపల్లి మండలానికి, దాసుగూడ, లింగరావుగూడ, శేరిఫైజాబాద్, మంగళపల్లి రెవెన్యూ గ్రామాలను చిలప్‌చెడ్ మండలానికి మారుస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. అధికారులు నోటిఫికేషన్ సైతం ఇచ్చారు. ఎలాంటి అభ్యంతరాలు రాకపోవడంతో ఆయా మండలాల్లో విలీనాలు జరగాల్సి ఉంది. కానీ రెండేళ్లు గడిచిన సమస్య ఇంకా తీరలేదు.

మారిన 'రెవెన్యూ'

ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడంతో రెవెన్యూ పరంగా మాత్రం మార్పు జరిగింది. అంతారం రెవెన్యూకు సంబంధించి ధరణిలో అప్‌లోడ్ కాగా దాసుగూడ, లింగరావుగూడ, శేరిఫైజాబాద్, మంగళపల్లి రెవెన్యూ గ్రామాలను చిలప్‌చెడ్ మండలానికి మార్చారు. కాగా ఎంపీడీఓ, పోలీస్‌శాఖ, ఉపాధిహామీ, ఐకేపీ, పీహెచ్‌సీ, విద్యాశాఖతో పాటు ఇతరశాఖల అధికార కార్యక్రమాలు మాత్రం మార్పు జరగలేదు. అంతారం గ్రామస్తులు రెవెన్యూ సమస్యలపై కౌడిపల్లికి వస్తున్నప్పటికీ.. ఇతర సమస్యల పరిష్కారం కోసం చిలప్‌చెడ్ వెలుతున్నారు. అధికారులు స్పందించి సమస్య తీర్చాలని కోరుతున్నారు. ఇదే విషయమై ఎంపీడీఓ శ్రీనివాస్‌ను వివరణ కోరగా అంతారం పంచాయతీని కౌడిపల్లి మండలంలోకి మార్చాలని మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదని చెప్పారు.

క్లుప్తంగా

కరాటేలో విద్యార్థుల ప్రతిభ


మెడల్స్, సర్టిఫికెట్స్‌తో విద్యార్థులు

అక్కన్నపేట(హుస్నాబాద్): హుస్నాబాద్ పట్ట ణంలోని కేరళ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌కు చెందిన 21 మంది విద్యార్థులు తెలంగాణ స్టేట్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో గోల్డ్, సిల్వర్ మెడల్‌ను సాధించారు. ఈ పోటీలను 8వ తేదీన హనమకొండలోని కాకతీయ యూనివ ర్సిటీలో నిర్వహించారు. సోమవారం సీఐ శ్రీని వాస్ చేతుల మీదుగా విద్యార్థులు మరోసారి మెడల్స్, సర్టిఫికెట్లు అందుకున్నారు. అనం తరం ఆయన మాట్లాడుతూ.. కేరళ హైస్కూల్ చెందిన 21 మందిలో 9 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్, 8 మందికి సిల్వర్, ముగ్గురు బ్రాంజ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. కార్య క్రమంలో పాఠశాల చైర్మన్ బుర్ర రాజేందర్, కరస్పాండెంట్ అల్లిస శైలేందర్, కరాటే మాస్టర్ భూక్య రమేశ్ నాయక్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని గోనెపల్లిలోని హోటల్‌లో పేకాట ఆడుతున్నా రని నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, చిన్నకోడూరు పోలీ సులు సోమవారం రాత్రి దాడులు చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 4,900, మూడు మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.

నాటుసారా స్వాధీనం


నాటు సారాను పట్టుకున్న పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..

అక్కన్నపేట(హుస్నాబాద్): గుడుంబా తయారీపై ఉక్కు పాదం మోపుతామని ఎక్సైజ్‌శాఖ సీఐ పవన్ అన్నారు. 3వ తేదీన ఇష్టానుసారంగా.. తండాల్లో యథేచ్ఛగా గుడుంబా తయారీ అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి పోలీ సులు స్పందించారు. ఆదివారం రాత్రి అక్క న్నపేట మండలం గండిపల్లి గ్రామ పరిధిలోని హేన్యతండాకు చెందిన మూడావత్ కిషన్ బైక్‌పై 10 లీటర్ల నాటుసారా తరలిస్తున్నాడని సమాచారం మేరకు తనిఖీ చేసి పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. సోమవారం సీఐ మాట్లాడుతూ.. నిషేధిత నాటుసారా తయారీ, రవాణా చేసినా నేరమేనన్నారు. విక్ర యించిన వారు ఎంతటి వారైన వదిలిపెట్టే ప్రసక్తిలేదన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ దామో దర్, కానిస్టేబుళ్లు సతీశ్, గణేశ్, సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.

వివాహం కావడం లేదని ఉరేసుకొని ఆత్మహత్య

నంగునూరు(సిద్దిపేట): ఉరి వేసుకొని యువ కుడు అత్మహ్యా చేసుకున్నాడు. రాజగోపా ల్‌పేట ఎస్‌ఐ ఆసీఫ్ కథనం మేరకు.. మండ లంలోని సిద్దన్నపేట గ్రామానికి చెందిన సంగు భాస్కర్ (36) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. చాలా రోజులుగా పెళ్లి కుదరడం లేదని నిత్యం బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో మనస్తా పానికి గురై ఆదివారం రాత్రి ఇంటికొచ్చి దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. తండ్రి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.


సమ్మేళనంలో ఆకునూరు పూర్వ విద్యార్థులు

అపూర్వ కలయిక.. జ్ఞాపకాల వేదిక

చేర్యాలలో 1992–93 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చేర్యాల(సిద్దిపేట): సిద్దిపేట జిల్లా చేర్యాల మం డల పరిధిలోని ఆకునూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో 1992–93 సంవత్సరంలో పదవ తరగతి చదువు కున్న విద్యార్థులందరూ పట్టణ కేంద్రంలోని వివే కానంద ఫంక్షన్‌హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మే ళనం నిర్వహించారు. మూడు దశాబ్దాల అనం తరం అందరూ ఒకచోట కలుసుకొని ఆత్మీయం గా పలకరించుకున్నారు. పట్టణ పరిసర ప్రాంతా లతోపాటు ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా తరలివచ్చారు. సుమారు 32 ఏళ్ల తర్వాత కలుసు కోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం నాడు తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. నిర్వాహకులు లింగారెడ్డి, మహేందర్‌రెడ్డి, మహేందర్ యాదవ్, రాజయ్య, నర్సింగరావు మాట్లాడుతూ.. అందరం ఇలా ఒక్కచోట చేరడం సంతోషంగా ఉందన్నారు. గురువులు చెప్పిన సూచనలు పాటిస్తూనే ఉన్నత స్థానాల్లో ఉన్నామని అందుకు వారికి రుణపడి ఉంటామని తెలిపారు. చివరగా అంతా గ్రూప్ ఫొటోలు కొత్త జ్ఞాపకాలను పదిలం చేసుకు న్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, పాఠాలు చెప్పిన గురువులు పాల్గొన్నారు.

యంత్రం.. రైతులకు దూరం

- నిరుపయోగంగా కస్టమ్ హైరింగ్ సెంటర్
- అద్దెకు యంత్రాలు దొరక్క రైతుల అవస్థలు
- కోహెడలో రెండేళ్ల కిందట ఏర్పాటు
- తుప్పు పడుతున్న వ్యవసాయ పనిముట్లు
- మూలనపడ్డ పవర్ వీడర్, డ్రోన్
- పట్టించుకోని అధికారులు


ఐకేపీ కేంద్రంలో నిర్వహణ లేక మూలనపడ్డ డ్రోన్


మొక్కజొన్నకు రసాయన మందు స్ప్రే చేస్తున్న డ్రోన్

కోహెడరూరల్(హుస్నాబాద్): మహిళా సంఘాలకు ఆదాయాన్ని సమకూర్చడంతోపాటు రైతులకు తక్కువ ధరకే యంత్రాలను అద్దెకు అందించాల్సిన కస్టమ్ హైరింగ్ కేంద్రం అలంకారప్రాయంగా మారింది. రెండేళ్ల కిందట మండల కేంద్రంలోని ఐకేపీ సెంటర్‌లో కస్టమ్ హైరింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారగా, లక్షలాది రూపాయల విలువైన పరికరాలు తుప్పు పట్టే పరిస్థితి నెలకొం ది. దీంతో ప్రభుత్వ లక్ష్యంగా నీరుగారి నిధులు వృ థాగా మారడంతోపాటు రైతులు బయటి మార్కె ట్‌లో యంత్రాలను అద్దెకు తెచ్చుకొని ఆర్థికంగా నష్టపోతున్నారు.

సాగులో యాంత్రీకరణ పెరుగుతున్న నేప థ్యంలో గ్రామీణాభివృద్ధిశాఖ ఓ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మహిళా సంఘాల ద్వారా కస్టమ్ హైరింగ్ సెంటర్ల (వ్యవసాయ పరికరాలు–యంత్రాల అద్దె కేంద్రాలు)ను ఏర్పాటు చేయించిం ది. ఇందులో భాగంగా మండల కేంద్రంలో 2021–22 సంవత్సరంలో మహిళా సమాఖ్య సం ఘం ద్వారా మండల కేంద్రంలో సెంటర్‌ను ప్రారం భించింది. సుమారు రూ.22 లక్షలతోపాటు అన్ని రకాల పరికరాలను అందుబాటులో ఉంచాల్సి ఉం డగా రూ.9 లక్షలతో పవర్ వీడర్, డ్రోన్ మాత్రమే కొనుగోలు చేశారు. రైతులు తమ అవసరాన్ని బట్టి వాడే పనిముట్లు, యంత్రాలకు మార్కెట్ ధరలో 50 శాతం ధరతో అద్దెకు ఇస్తారు. కానీ నిర్వహణ లేక పోవడంతో ఈ కేంద్రం అలంకార ప్రాయంగా మారింది.

అందుబాటులో ఉండాల్సినవి

కస్టమ్ హైరింగ్ సెంటర్‌లో ట్రాక్టర్, కల్టివేటర్, పవ ర్ వీడర్, పవర్ టిల్లర్, టార్పాలిన్లు, పవర్ స్ప్రేయ ర్లు, పోయింగ్ అండ్ ఫెర్టిలైజర్, డ్రిల్లర్, ట్రాక్టర్ ఆప రేటర్ తదితర పనిముట్లు అందుబాటులో ఉండాలి.

పట్టింపులేని అధికారులు

రైతులకు వ్యవసాయ పరికరాలు అందించి వెన్నుద న్నుగా నిలవాల్సిన అధికారుల పట్టింపులేని తనం తోపాటు మహిళా సంఘాలకు సరైన అవగాహన లేక ట్రాక్టర్‌తోపాటు పనిముట్లు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. యంత్రాలను రైతులకు అద్దెకు ఇచ్చి మహిళా సంఘాలు ఆదాయాన్ని సమ కూర్చుకునేవి. కానీ కస్టమ్ హైరింగ్ కేంద్రం నిరుప యోగంగా మారడంతో ఎలాంటి ఆదాయాన్ని పొం దలేక పోతున్నారు.

బయటి మార్కెట్‌లో అద్దెకు..

మండలంలో ఎక్కువగా వ్యవసాయాధారిత కుటుంబాలే ఉన్నాయి. రైతులు వ్యవసాయ యం త్ర పరికరాల కోసం ఇబ్బంది పడొద్దని కస్టమ్ హైరింగ్ కేంద్రాల ద్వారా యంత్రాలను అద్దెకు ఇచ్చి తోడ్పాటునందిస్తుంది. దీంతో రైతు పెట్టుబడి తగ్గడంతోపాటు, సాగు విస్తీరణం కూడా పెరిగేం దుకు అవకాశం ఉంది. కానీ అధికారులు యం త్రాలు, పరికరాలు అందుబాటులో ఉంచకపోవడం తో రైతులు బయటి మార్కెట్ లో అద్దె చెల్లించి ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా అధికా రులు ఈ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురా వాలని రైతులు, ప్రజలు వేడుకుంటున్నారు.

సాగు ఖర్చులు తగ్గుతాయి



రైతుల సాగులో అద్దె పనిముట్లు అందుబాటులో ఉంచితే రైతులకు చాలా మేలు జరుగుతుంది. అద్దె పనిముట్లు ఉన్నట్లు మాకు ఇప్పటి వరకు తెలి యదు. అద్దెకు ఇస్తే రైతులకు సాగు ఖర్చులు తగ్గ తాయి. కాబట్టి అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలి.

– ఆర్రె లక్ష్మయ్య, రైతు సముద్రాల

అధికారులు దృష్టిసారించాలి



సన్న, చిన్న కారు రైతులకు అద్దె పనిముట్ల పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. సాగులో అధిక ఖర్చులు పెట్టుకునే స్థోమత లేని రైతులు దీని వల్ల లాభం చేకూరుతుంది. రైతులకు ఉపయోగకరంగా ఉండే ఇలాంటి పథకాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి.

–కూసుంబ రాజు, రైతు ఆరెపల్లి

పొలానికి నడుచుకుంటూ వెళ్తుండగా..

- కారు ఢీకొని భార్య మృతి, భర్తకు తీవ్ర గాయాలు


గాయాలతో నాగరాజు


వట్టపు లక్ష్మీ(ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): పొలం వద్ద నారుమడి విత్తనాలు అలికేందుకు భార్యభర్తలు ఇద్దరూ నడు చుకుంటూ వెళ్తుండగా కారు మృత్యురూపంలో కబ లిచింది. వెనుకనుంచి వేగంగా ఢీకొట్టడంతో భార్య మృతి చెందగా, భర్తకు తీవ్రగాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన మెదక్ జిల్లా చిన్నశంకరం మండల పరిధిలో చోటు చేసుకుంది. నార్సింగి ఎస్‌ఐ అహ్మద్ మోహినోద్దీన్ కథనం మేర కు.. నార్సింగి మండల కేంద్రానికి చెందిన వట్టపు లక్ష్మీ(40), నాగరాజు దంపతులు గ్రామ శివా రులోని వారి పొలం వద్ద సోమవారం నారుమడి విత్తనాలు అలికేందుకు నార్సింగి జాతీయ రహదా రిపై నడుచుకుంటూ వెళ్తున్నారు. మార్గమధ్యలో సప్తగిరి రైస్‌మిల్ ఎదుట హైదరాబాద్ వైపు నుంచి వేగంగా వచ్చిన కారు దంపతులిద్దరినీ వెనుక నుం చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మీ అక్కడికక్కడే మృతి చెందగా, నాగరాజుకు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికుల సాయంతో 108 అంబులెన్స్‌లో రామాయంపేట ప్రభుత్వ ఆస్ప త్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న తహసీల్దార్ షేక్ కరీం, నార్సింగి ఎస్‌ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాద స్థలంలో కారు మాత్రమే ఉందని, ఢీకొట్టిన వారు పరారైనట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

హుస్నాబాద్‌రూరల్: విద్యార్థిని ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన హుస్నాబాద్ మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పూల్‌నాయక్ తండాకు చెం దిన విద్యార్థిని మీర్జాపూర్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి చదువుతోం ది. ఆదివారం సాయంత్రం తల్లి పాఠశాలకు వచ్చి పెళ్లి విషయంలో మందలించడంతో మనోవేదనకు గురైంది. ఈ క్రమంలో హెయిర్ ఆయిల్ తాగి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేయగా సిబ్బంది 108 వాహనంలో హుస్నా బాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ప్రిన్సిపాల్ జయమాలను వివరణ కోరగా విద్యార్థిని పెళ్లి విషయంలో తల్లిదం డ్రులు మందలించడంతోనే ఆత్మహత్యాయ త్నం చేసిందన్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం మెరుగుగానే ఉందన్నారు.

టీవీఎస్ ఎక్సెల్‌లో మంటలు


మంటల్లో వాహనం

నిజాంపేట(మెదక్): ప్రమాదవశాత్తు టీవీఎస్ ఎక్సెల్‌లో మంటలు చెలరేగగా స్థానికుల అప్రమత్తతో ప్రమాదం తప్పింది. ఈ ఘటన రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం లోని ఇసన్నపల్లి గ్రామానికి చెందిన గుడిసె యాదగిరి టీవీఎస్ ఎక్సెల్‌కు మరమ్మతులు రావడంతో పేటలోని ఓ వెల్డింగ్ దుకాణంలో చేయిస్తున్నాడు. వెల్డింగ్ చేసే క్రమంలో ఒక్కసారిగా నిప్పురవ్వలు వాహనం పెట్రోల్ పైపునకు అంటుకోవడంతో మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే పెట్రోల్ ట్యాంక్ నుంచి పెద్ద ఎత్తున మం టలు చెలరేగాయి. అప్రమత్తమైన స్థానికులు మంట లను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం పాక్షికంగా దెబ్బతింది.

మట్టిని తోడేస్తున్నారు

జిన్నారం (పటాన్‌చెరు): చెరువులు, కుంటలను మాయం చేస్తూ అక్రమార్కులు దర్జాగా మట్టి రవాణా చేస్తున్నారు. జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూములైన అలీనగర్ సర్వే నంబర్ 79, భైరవకుంట నుంచి అర్ధరాత్రి కొందరు వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా పెద్ద ఎత్తున మట్టిని తరలిస్తున్నారు. ఈ మట్టిన టిప్పర్ల ద్వారా గడ్డపోతారం పారిశ్రామిక వాడతోపాటు రంగారెడ్డి జిల్లాలోని గగిలా పూర్ గండి మైసమ్మ ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీం తో ప్రభుత్వానికి భారీగా గండి పడుతుంది. ఈ వ్యవహా రంపై రెవెన్యూ యంత్రాంగం తూతూ మంత్రంగా చర్యలు తీసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తు న్నాయి. బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించి ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను కాపాడాలని స్థాని కులు కోరుతున్నారు.


మట్టిని తరలిస్తున్న టిప్పర్లు

తీరనున్న రైతన్న కష్టాలు

- సిర్గాపూర్ మండలం అంతర్‌గాంలో గోదాం నిర్మాణం
- రూ.47 లక్షలతో పనులు పూర్తి


అంతర్‌గాంలో నిర్మించిన గోదాం

కల్హేర్(నారాయణఖేడ్): గోదాం నిర్మాణంతో రైతన్న కష్టాలు తీరనున్నాయి. సిర్గాపూర్ మండలం అంత ర్‌గాంలో బోక్కస్‌గాం ప్రాథమిక వ్యవసాయ సహ కార సంఘం ఆధ్వర్యంలో రూ.47 లక్షల వ్యయం తో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాం పనులు పూర్తి చేశారు. రైతులు పండించిన ధాన్యం నిల్వలు పెట్టుకునేందుకు అందుబాటులోకి రానుం ది. అంతర్‌గాంలో కొత్తగా గోదాం నిర్మాణం చేసేం దుకు బోక్కస్‌గాం పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరె క్టర్ గుండు వెంకట్‌రాం చొరవ తీసుకున్నారు. నాబార్డు ద్వారా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీతో డీసీసీబీ–టెస్కాబ్ ద్వారా రూ.47 లక్షలు మం జూరు చేయించి నిర్మాణం పూర్తి చేశారు. దీంతో ధాన్యం నిల్వ చేసుకోవడానికి రైతులు పడే ఇబ్బం దులు తీరాయి.

జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టు నల్లవాగు ఆయకట్టు పరిధిలో ఉన్న అంతర్‌గాంలో ఎక్కువ సంఖ్యలో రైతులు ఉన్నారు. ఇక్కడి రైతులు వ్యవ సాయ రంగంపై ఆధారపడ్డారు. అంతర్‌గాంలో గోదాం నిర్మాణంతో బోక్కస్‌గాం, సుల్తానాబాద్, చిన్నాముబారక్‌పూర్, పెద్దముబారక్‌పూర్, పోట్ పల్లి, గరిడెగాం, తదితర గ్రామాల రైతులు ధాన్యం నిల్వలు పెట్టుకునేందకు ఉపయోగించుకోవచ్చు. రైతులకు అవసరమైన సమయంలో అమ్ముకునేం దుకు వీలుంటుంది. గోదాం నిర్మాణంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి వేందర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసేందుకు జిల్లా సహకార శాఖ అధికారులు దృష్టి పెట్టారు.

రైతులకు మేలు



అంతర్‌గాంలో కొత్తగా గోదాం నిర్మాణంతో చుట్టూ ప క్క గ్రామల రైతులకు కూడా మేలు జరుగుతుంది. రైతు లు పండించిన వరి, జొన్న, నిల్వలు చేసుకునేందుకు వాడుకోవచ్చు. ధర అనుకూలంగా ఉంటే ధాన్యం అమ్ముకోవచ్చు.

– జలెందర్ రెడ్డి, రైతు, అంతర్‌గాం

త్వరలో ప్రారంభిస్తాం



బోక్కస్‌గాం పీఏసీఎస్ పరిధిలోని రైతుల సంక్షేమం కోసం ప్రాధాన్యత ఇస్తున్నం. రైతుల అవసరాలు గుర్తించి గోదాం నిర్మాణం పనులు పూర్తి చేశాం. త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రైతులకు అందుబా టులోకి తెస్తాం.

– గుండు వెంకట్‌రామ్, డీసీసీబీ డైరెక్టర్

సాఫ్ట్‌బాల్ విజేత మెదక్ జట్టు


విజేతగా నిలిచిన మెదక్ జట్టు

ఆర్మూర్‌టౌన్: నిజామాబాద్ జిల్లా ఆరూమ్‌ర్ పట్ట ణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన 68వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ అండర్–17 బాలబాలికల టోర్నీలో మెదక్, మహబూబ్‌నగర్ జట్లు విజేతగా నిలి చాయి. సోమవారం ముగింపు కార్యక్రమానికి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి నాగమణి హాజ రయ్యారు. టోర్నీలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఎంపికై న క్రీడాకారులకు వచ్చే ఏడాది జనవరి 6 నుంచి 9వ తేదీ వరకు మహారాష్ట్రలోని జల్‌గావ్‌లో నిర్వ హించనున్న జాతీయ స్థాయి పోటీల కోసం శిక్షణ శిబిరం నిర్వహిస్తామని నాగమణి తెలిపారు.

విజేతలు..

బాలుర విభాగంలో మొదటి స్థానంలో మెదక్, ద్వితీయ స్థానంలో నిజామాబాద్, తృతీయ స్థానం లో ఆదిలాబాద్ జట్లు నిలువగా, బాలికల విభాగం లో మొదటి స్థానంలో మహబూబ్‌నగర్, ద్వితీయ స్థానంలో నిజామాబాద్ జట్లు నిలిచాయి .

ఇసుక వేలంలో అధికారుల ఇష్టారాజ్యం


ముగ్గు పోసి వేలం వేయని ఇసుక

చిలప్‌చెడ్(నర్సాపూర్): అధికారం చేతిలో ఉంటే చాలు ఏదైనా తమ ఆధీనంలోనే ఉంటుందని మం డల రెవెన్యూ అధికారులు నిరూపించారు. బండపో తుగల్ గ్రామంలో 7న జరిగిన ఇసుక వేలంలో రెవెన్యూ అధికారులు తమ మాయజాలాన్ని ప్రద ర్శించారు. వివరాల్లోకి వెళితే.. బండపోతుగల్ గ్రా మంలో అక్రమంగా తరలించిన ఇసుక (సుమారు 13 చోట్ల)ను సీజ్ చేసిన విషయం విధితమే. ఇంటి నిర్మాణాల కోసం పోయించుకున్నామని, ఇసుక కుప్పలను వదిలేయమని బాధితులు కోరగా, కలె క్టర్ ఆదేశాలతో ఎవ్వరినీ వదిలేది లేదని తహ సీల్దార్ ముసాద్దీక్ స్పష్టం చేశారు. ఈ ఇసుకను వేలానికి పెట్టారు. రెవెన్యూ అధికారులు కేవలం 6 చోట్ల ఉన్న ఇసుకను మాత్రమే వేలం వేశారు. అది కూడా ఇంటి నిర్మాణం కోసం తెచ్చుకున్నది. గ్రామంలో మరో ఏడు చోట్ల ఉన్న నాయకుల, కాం ట్రాక్టర్ల ఇసుక కుప్పలకు ముగ్గు పోసి వేలం వేయలేదు. ముఖ్యంగా మాజీ ఉపసర్పంచ్ మాణిక్యం పాఠశాల పనుల నిమిత్తం అక్రమంగా తరలించిన ఇసుకను సీజ్ చేసి వేలం వేయలేదు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం సీజ్ చేసిన మొత్తం ఇసుకను వేలం వేయకపోవడం అనుమానాలకు దారితీస్తుంది. సోమవారం వేలం వేయని ఇసుక విషయమై తహసీల్దార్ ముసాద్దీక్‌ను వివరణ కోరగా ఇంటి నిర్మాణం కోసం తెచ్చుకున్న ఇసుకను వేలం వేయలేదని తెలిపారు. పాఠశాలలో డంప్‌చే సిన ఇసుక రెవెన్యూ ఆధీనంలో ఉందన్నారు.

ఇంటి నుంచి వెళ్లి మృతదేహమై లభ్యం


నాగయ్య (ఫైల్)

రేగోడ్(మెదక్): మతిస్థిమితం లేని వ్యక్తి మృత దేహం లభ్యమైన ఘటన మండలంలోని కొం డాపూర్ గ్రామ శివారులో సోమవారం చోటు చేసు కుంది. ఎస్‌ఐ పోచయ్య కథనం మేరకు.. మండలం లోని జగిర్యాల గ్రామానికి చెందిన బేగరి నాగయ్య (69) గత నెల 22న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభిం చకపోవడంతో తండ్రి కనిపించడం లేదంటూ కుమారుడు రాములు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో 6న ఫిర్యాదు చేశాడు. సోమ వారం కొండాపూర్ శివా రులో గుర్తు పట్టలేని స్థితిలో లభ్యమైన మృతదేహం కాగా నాగయ్యదిగా గుర్తించారు. కుళ్లిపోయిన మృతదేహానికి ఘటనా స్థలంలోనే పోస్టు మార్టం నిర్వహించి, ఎలా చనిపోయాడనే దానిపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రెండు కార్లు ఢీ : ఒకరి మృతి

- నలుగురికి గాయాలు
- ఏడుపాయల దర్శనానికి వెళ్లొస్తుండగా ప్రమాదం

నర్సాపూర్ రూరల్: రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొని ఒకరు మృతి చెందగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. నర్సాపూర్ ఎస్‌ఐ లింగం కథనం మేరకు.. వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన అధ్యాపకులు బింగి శ్రీకాంత్ (30) మిత్రులతో కలిసి ఏడుపాయల వనదుర్గా మాత దర్శనానికి వెళ్లి ఆదివారం రాత్రి తిరుగు ప్రయాణం అయ్యారు. నర్సాపూర్–మెదక్ జాతీయ రహదారిలోని పెద్ద చింతకుంట జల హనుమాన్ సమీపంలో వీరి కారు ఎదురుగా వచ్చిన మరో కారు ఎదురెదురుగా ఢీకొ న్నాయి. ఈ ప్రమాదంలో శ్రీకాంత్ అక్కడికక్కడే మృతి చెందగా అతని మిత్రులు శివరాములు, యాదగిరి, శివకృష్ణ, రాఘవేంద్రకు గాయాల య్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండు బైకులు ఢీ : ఇద్దరికి గాయాలు

మిరుదొడ్డి(దుబ్బాక): రెండు బైకులు ఎదురె దురుగా ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాల య్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని లింగుప ల్లిలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చెప్యాలకు చెందిన యాదగిరి మిరుదొడ్డి వైపు నకు బైక్‌పై వస్తుండగా మిరుదొడ్డి మండల కేంద్రా నికి చెందిన కుమ్మరి రాజు బైక్‌పై గజ్వేల్ వైపునకు వెళ్తున్నాడు. మార్గమధ్యలో లింగుపల్లి వద్ద రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో యాదగి రి, రాజుకు గాయాలయ్యాయి. విషయం తెలుసు కున్న మిరుదొడ్డి ఎస్‌ఐ పరుశరాములు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను సిద్దిపేట ప్రభు త్వాస్పత్రికి తరలించారు.

మురికి కాల్వలో పడి వ్యక్తి..


నర్సింలు(ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్) : తాగిన మైకంలో మురుగు నీటి కాల్వలో పడి వ్యక్తి మృ తి చెందిన ఘటన మండల పరిధిలోని జక్కన్నపేట గ్రామంలో సోమవారం వెలు గులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన బుర్క నర్సింలు(35) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి మద్యం సేవించి వస్తున్న క్రమం లో ఇంటి దగ్గర ఉన్న మురుగునీటి కాల్వలో మలవి సర్జన చేస్తుండగా ప్రమాదవశాత్తు అందులో పడి ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విష యాన్ని సోమవారం తెల్లవారుజామున గుర్తిం చారు. కుటుంబీకుల సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని హవేళిఘణాపూర్ పోలీసులు పరిశీలిం చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నారు.

మహిళ కాలుపై నుంచి వెళ్లిన బస్సు

వట్‌పల్లి(అందోల్): మహిళ కాలుపై నుంచి బస్సు వెళ్లడంతో తీవ్ర గాయాలైన ఘటన సోమవారం అందోలు మండల పరిధిలోని అన్నాసాగర్ గ్రామ రోడ్డు వద్ద చోటు చేసుకుంది. జోగిపేట ఎస్‌ఐ పాం డు కథనం మేరకు.. అన్నాసాగర్ గ్రామానికి చెం దిన ఎరుకల పెంటమ్మ చిలప్‌చెడ్ గ్రామానికి వెళ్లేం దుకు గ్రామ రోడ్డు వద్ద బస్సు కోసం నిలబడింది. నర్సాపూర్ డిపో బస్సు రాగానే ఎక్కే క్రమంలో కిం దపడటంతో ఆమె ఎడమ కాలుపై నుంచి వెళ్లింది. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధిత మహిళ బావ బీరప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.